# స్వర్గాదపి గరీయసి

నిర్మలాకాశంలో చంద్రుడొక్కడే కనిపిస్తున్నాడు. చంద్రుడికైతే తారలెన్నో కనిపిస్తున్నాయి.

నడుముకు బెల్ట్‌ను బిగించేసి నిటారుగా కూర్చున్నాడు సీటులో. కుదుపు లేకుండా ముందుకూ వెనక్కూ ఊగుతున్నాడు. ఒక్కసారి అమాంతం పైకి గాలిలో తేలిపోతుంటే, అతని ఆలోచనలు కూడా ఆకాశంలో విహరిస్తున్నాయి.

బెల్ట్ విప్పేసుకుని నడుం వంచి కళ్ళను క్రిందికి దించాడు.

భూమి ఓ పచ్చికబయలుగా కనిపిస్తోంది. తాను భూమికి ఎంతో దూరంగా పైకి వెళ్ళిపోయాడు. అయితే భూమి ఆకర్షణశక్తికి లోబడే 'బోయింగ్' గంటకు అయిదువందల మైళ్ళ వేగంతో పయనిస్తోంది.

చంద్రుడూ అంతే! నిర్మల ఆకర్షణ శక్తిని పూర్తిగా తప్పించుకో

లేకపోతున్నాడు. ఎంత ప్రయత్నం చేసినా ఎన్నడో తనకు తెలీకండా, ఆమె తన మనస్సును ఆకట్టేస్తున్నట్టుగా కనిపిస్తోంది. తన ఆలోచనలు ఎంతో వేగంగా అటూ ఇటూ పరుగెత్తుతున్నా, మధ్య మధ్య నిర్మల తనను పలకరిస్తున్నట్టే అనిపిస్తోంది.

ఇది తన భ్రమ. అనిత యెక్కడ! నిర్మల యెక్కడ! తనలో తాను తర్కించుకున్నాడు.

ముప్పయివేల అడుగుల ఎత్తున విమానంలో హైదరాబాద్‌నుంచి ఢిల్లీ వెళుతున్న చంద్రుడికి నల్లకుంటలో రామ మందిరం ప్రక్క సందులో పెంకుటింట్లో వున్న నిర్మల ఓ చిన్న చీమ, దోమలాగ స్ఫురించింది. తన కంటికి ఆనటంలేదు. అయితే ఆమెను గురించి ఒక్క క్షణమైనాసరే ఆలోచించాల్సిన అవసరం యేమిటో అతనికి అర్థంకావటం లేదు.

లండన్‌లో మనదేశంయొక్క గొప్పతనాన్ని చెపుతూ చెపుతూ ఉద్యోగంలో స్థిరపడిపోయిన అనిత, ఆమె వుంటున్న భవనంలో ఆ గది దాని 'డెకొరేషన్' యింకా యింకా యెన్నో తన కళ్ళల్లోకి వచ్చి కూర్చున్నాయి. ధగధగ మెరిసే ఆ కాంతికి అతని కళ్ళు మూసుకుపోయినాయి.

"నాన్‌వెజ్!..." ఎయిర్ హోస్టెస్ వినయానికి అతని కళ్ళు తెరుచుకున్నాయి.

"నో ప్లీజ్...వెజ్" అనటమేమిటి, తన మనస్సు గభాలున వెళ్ళి నిర్మలమీద వాలటం యేమిటి, రెండూ ఒక్కసారిగా జరిగిపోయినాయి.

తాను పెళ్ళిచూపులకని వెళ్ళినపుడు నమస్తే అంటూ నిలబడ్డ నిర్మల ఆకృతి రూపురేఖలు చెదిరిపోవటం లేదు.

# 3

పెళ్ళిచూపుల కెమేరాలోకి యింకా చాలా ఫోటోలు వచ్చినాయి. సుదక్షిణ, సబిత, ప్రభ, పద్మ వగైరాలు. వాళ్ళ ఫోటోలూ బాగానే వున్నాయి.

అందరికీ తాను నచ్చాడు. అందరినీ తాను మెచ్చాడు. అందుకనే ఇంత మధన, ఇంత వ్యధాను.

అందరిలోనూ అనిత అంతస్థు వేరు. తాను నిమిషాలమీద 'జట్'లో లండన్‌లో వాలినట్టు, ఆమెతో మాట్లాడుతున్నట్టు తన ఊహ. అంత స్పీడుగా వెళుతున్న మనస్సు ఏదో క్షణంలో నిలబడి నిర్మలవైపు యిట్టే తిరుగుతుంది.

మనస్సు మహా చంచలంగా వుంది. ఒక్కచోట నిలబడటం లేదు. అటూ యిటూ పరుగెత్తుతోంది. దాన్ని పట్టుకుని ఆపటానికి అతనికి సాధ్యం కావటంలేదు.

విసురున వెళ్ళి సుదక్షిణతో మాట్లాడుతుంది. చప్పున వెనక్కి తిరిగి ప్రభవైపు చూస్తుంది. పద్మ నిజానికి తనకు తగిన వధువు. అనుకుంటుంది. మళ్ళా మనస్సు అనితవైపు మళ్ళుతోంది.

ఇన్ని రకాల ఆకర్షణల మధ్య బలైపోతున్నాడు. శరీరం కుంగిపోతోంది.

డబ్బు ఎరకు ఓప్రక్కన క్రుంగిపోతుంటే, అందానికి మరోవైపు దాసుడయి పోతున్నాడు.

నీళ్ళ ప్రవాహం నిలకడగా తొణక్కుండా గంభీరంగా కనిపిస్తుంది. దిగుతేగాని లోతు తెలీదు.

తాను చూచిన ఆడపిల్లలందరూ ఒకేమాదిరి కనిపిస్తున్నారు. ఎవ రేమిటో అర్థంకావటంలేదు.

అయినా తనను గురించి వాళ్ళు తెలుసుకున్నది మాత్రం ఏముంది.

ఎర్రగా సన్నగా ఉంటాడు. పొడుగరి పెద్ద పెద్ద కళ్ళు. ఠీవిగా దర్జాగా కనిపిస్తాడు. డాక్టరు పరీక్ష పాసయ్యాడు. ఫారెన్ వెళ్ళాలని తహతహ లాడుతున్నాడు. అంతే తనను గురించి వాళ్ళకు తెలిసింది వాళ్ళకు కావాల్సిందికూడా అంతేనేమో! అసలు యెవ్వరూ యేమీ అడగందే!

లండన్‌లోనే ప్రాక్టీసు పెట్టచ్చు. దానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ చేసేస్తారు. అనిత ఫారెన్ సర్వీసులో వుంది. తనకు కావాల్సింది కూడా అదే!

అసలు మనదేశంలో 'టాలెంట్'కు గౌరవం లేదు. 'రికగ్నిషన్' లేదు. అదీ బెల్లమూ ఒకటే!

ఇక్కడ లాభంలేదు!

ఈ ఆలోచనతోనే అతని మనస్సు అనితవైపు పూర్తిగా ఆకట్టేసింది.

"....లేదండీ రేపే వచ్చేస్తాం....యం.బి.ఏ. అయిపోయిందిగా, యింకా అక్కడెందుకు. మా ఇండస్ట్రీ వుండనే వుంది. అది చూసు కుంటాడు. అవును....అక్కడే సెటిల్ అయిపోతాడు....మారేజ్ కూడా 'ఫిక్స్' అయిపోయింది...!

ప్రక్కసీటులో కూర్చున్న పెద్ద మనిషి అంటున్న మాటలకు చంద్రుడు చెవులు అప్పచెప్పాడు.

"....అవును....సబితే!...."

# 5

"ఆ!....సబిత...." చంద్రుడు మెల్లిగా అన్న మాటలు కూడా ఆయన విన్నాడు.

చప్పున ఇటు తిరిగాడు.

చంద్రుడు గతుక్కుమన్నాడు. తెల్లమొహం వేసి ఆయనవంక చూస్తూ, "మా వాళ్ళ అమ్మాయి పేరుకూడా సబితే!" అంటూ సర్దుకున్నాడు.

ఆయనేమీ మాట్లాడలేదు.

అయితే వాళ్ళ సంభాషణను బట్టి చూ స్తే, తాను చూసిన పిల్లేనని స్పష్టంగా తెలుస్తోంది.

చంద్రుడి మనస్సు విలవిలలాడి పోయింది.

సబిత చాలా అందంగా వుంటుంది. చదువుకుంది. తనకు యీడూ జోడూ బాగా వుంటుందని అన్నారు కూడా. ఏం లాభం. అయిపోయింది చెయ్యి జారిపోయింది. తొందరగా నిర్ణయం చెయ్యకపోతే వచ్చే అనర్థాలే యివి.

మనస్సు గంతులేస్తూ పరుగెత్తుతోంది. క్షణంలో ఆగిపోతోంది.

'కాఫీ....' ట్రే పట్టుకుని నిలబడింది.

'నో ప్లీజ్....టీ....' చంద్రుడి సమాధానానికి ఆమె నవ్వింది. ఆ నవ్వుకు అర్థంలేదు. యాంత్రికమైన నవ్వు, డ్యూటీలో ఓ భాగం. ఎయిర్ హోస్టెస్ అందరి దగ్గరకు వెళ్లుతుంది. కాని ఎవ్వరితోను సన్నిహితంగా వుండదు.

చంద్రుడి మనస్సూ అంతే! తాను చూసిన వాళ్ళందరిమీదా మోజే! కాని ఎవరిమీదా యే అభిప్రాయం కలగటం లేదు.

ఇన్ని ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోతుంటే తనకో ఫ్రెండ్ ఉత్తరం మాట మధ్యలో గుర్తుకొచ్చింది.

"....నువ్వు లండన్ వచ్చేసెయ్యి సూటిగా. వచ్చేటప్పుడు అచ్చమ్మనూ బుచ్చమ్మనూ కట్టుకు రానక్కరలేదు. పెథిక్ లారెన్స్ మనమరాలొకతెవుంది. ఇండియన్‌ను పెళ్ళిచేసుకోవాలని ఉబలాట పడుతోంది. ఆవిడ 'స్టేచర్'కు నువ్వు సరిగా సరిపోతావు. .... నువ్విక్కడకు వస్తే యెన్నో చేస్తాను. ... ఆ మాటకొస్తే లార్డ్ మౌంట్ బాటెన్‌తో పరిచయం చేస్తాను....." యింకా యింకా యేమిటేమిటో రాశాడు.

వాడసలే వసపిట్ట. ఉత్తరంలోనే ఇన్ని రాశాడు. ఇహ యెదురు బడితే నోరు మూతబడదు. ఐరిష్‌దాన్ని పెళ్ళిచేసుకున్న ఘటం! వాడు ఏమైనా రాస్తాడు. ఏమైనా చేస్తాడు.

వెనక్కు తిరిగి చూశాడు. 'ఆమె' చేతిలో ప్లాస్టిక్ గ్లాసు క్రింద పడ్డ చప్పుడు విని.

చివరి వరసలో తనకు తెలిసిన వాళ్ళిద్దరు కూర్చుని వున్నారు. వాళ్లు మాటి మాటికి ఢిల్లీ వెళుతూనే వుంటారు. పైరవీ కోసం, దేశప్రజల్ని ఉద్ధరించటం కోసం, వాళ్ళు ఒకపనిచేసి ఒకపని చెయ్యరనిలేదు. అన్నింటిలోను తల దూరుస్తారు. అందర్నీ ఇరికిస్తారు. మళ్ళీ వాళ్ళను తప్పించి సరియైన స్తానాల్లో పెట్టడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తారు. అదే 'పైరవీ'.

చంద్రుడు కూడా ఒకసారి ఇరుక్కునే వాడే. వెంట్రుకవాసిలో తప్పిపోయింది. తప్పకపోతే ఈ పాటికి ఇద్దరు పిల్లల తండ్రయి కూర్చునేవాడే. అది తప్పించుకొని బైటపడ్డాడు. ఆ సంఘటన తలచుకుంటే చంద్రుడికి గుండె ఆగినంతపనవుతుంది.

తన దృష్టిని బలవంతంగా వాళ్ళమీద నుంచి తప్పించేసి బుద్ధి మంతుడిలాగా కూర్చున్నాడు.

'ఆమె' ఇచ్చిన టీ చప్పరిస్తూ, బిక్కమొహం వేసుకుని కూర్చున్నాడు.

దట్టంగా మేఘాలు కమ్ముకున్నాయి. మేఘాలని దాటి ఇంకా యెత్తుగా విమానం పయనిస్తోంది. అయినా తెల్లటి మేఘాలు పరుగెత్తుకుంటూ వస్తూ దూసుకుపోతున్నాయి. అటూ యిటూ వొరుగుతున్నాడు. అందరూ ఊగిసలాడుతున్నారు. ముందుకు పడుతున్నారు. అందరికి భయమేస్తోంది. ఏదో ఘోరం జరుగుబోతోందని అందరూ హడలిపోతున్నారు.

'బెల్ట్ కట్టుకోండి. భయపడనక్కర్లేదు' అని హామీ వినపడింది. ఆ హామీలో భయం తొణికిసలాడింది. అది మామూలే లెండి. 'క్లౌడ్స్' వచ్చినపుడు 'ఎయిర్ క్రాఫ్ట్' ఇట్లానే ఊగుతుంది అన్నాడు ఒకాయన.

చంద్రుడికే కాదు చాలామందికి ఈ మాటలు ధైర్యాన్ని ఇవ్వలేకపోతున్నాయి.

అసలు తాను ఫారెన్ వెళ్ళాలనుకొన్నప్పుడే యేదో అపశకునం యెదురయింది. 'ఫారెన్' వెళ్ళబోతూ ఈ శకునాల్తో ఏమిటని త్రోసిపుచ్చాడు. తాను చాలా పొరపాటు చేశానని తీవ్రంగా పశ్చాత్తాప పడుతున్నాడు.

పైన షెల్ఫ్‌లో పెట్టిన పేపర్లు కిందకు వచ్చేస్తున్నాయి. రెండు 'కుషన్సు' కూడా క్రింద పడ్డాయి

సన్నటి గొంతుతో అన్న మాటలు, గాభరాలో యెవ్వరికీ వినిపించటం లేదు.

'ఎయిర్ క్రాష్‌కంటే హైజాకింగ్, థౌజండ్‌టైమ్స్‌బెటర్' చంద్రుడు లోపల లోపల సణుక్కుంటున్నాడు.

క్రిందటిసారి 'హైజాకింగ్' అయినప్పుడు దాని 'రిపోర్టు' అంతా పేపర్లో వివరంగా చదివాడు. చదువుతుంటే తాను ఆ 'ప్లెయిన్'లో వుంటే యెంత బాగుండేది అని చాలా 'ఎక్సైటెట్' అయిపోయాడు. అదొక థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ చాలా ఆవేశపడ్డాడు. తన పేరు కూడా ఆ లిష్టులో చూసుకుని మురిసిపోవాలని అనుకున్నాడు.

'అయితే జరగరానిది జరిగితే ఇప్పుడు కూడా తనపేరు పేపర్లో వస్తుంది కాని తనకు చూసుకునే యోగ్యత వుండదు....

ఈ ఆలోచనకు వొళ్ళు పులకరించింది—గజగజలాడాడు.

తనకు ఎదురు సీటులో కూర్చున్న వాళ్ళిద్దరూ మూర్ఛపడి పోయారు. 'ఆమె' అటూ యిటూ 'డాన్స' చేస్తూ నీళ్ళు వాళ్ళ మొహం మీద చల్లుతోంది. వాళ్ళు తెప్పరిల్లుతున్నట్లు కనిపిస్తున్నారు.

మిగతావాళ్ళంతా యేమేమి అనుకుంటున్నారో గాని చంద్రుడు మాత్రం ఈ దెబ్బకు బతికి బైటపడితే మళ్ళీ ఈ విమానం జోలికి పోకూడదనుకుంటున్నాడు.

మేఘాలు సర్దుకున్నాయి. సూర్యరశ్మి వస్తోంది. ఒక్కసారిగా కొన్నివేల లైట్లు వెలిగినట్టు, వెలుతురు తెల్లగా ఆకాశమంతా విరజిమ్మేసుకుంది. ప్రక్క కిటికీల్లోంచి సూర్యకిరణాలు చిందర వందరగా లోపలికి వచ్చేస్తున్నాయి.

విమానం నిలకడగా వెళ్ళిపోతోంది. చంద్రుడి మొహం విప్పారింది.

అందరూ పెద్దగా నిట్టూర్చారు. 'ఆమె' మొహంలో నిజంగా సహజమైన నవ్వు చిందింది.

అందరూ తలొకరకంగా తమతమ అనుభవాల్ని ఏకరువు పెడుతున్నారు. ఒకర్నిచూసి ఒకరు చిరునవ్వుతో పలకరిస్తున్నారు.

చంద్రుడి మనస్సు స్తంభించిపోయింది. ఏ మాలోచన లేకుండా కళ్ళు మూసుకుని కూర్చున్నాడు.

కళ్ళు తెరిచాడు. అంతా కొత్తగాఉంది. కనురెప్పలు ఆర్పుతూ తెరుస్తూ చూస్తున్నాడు.

'ఆమె' ప్లాస్టిక్ ట్రేలో ప్లాస్టిక్ గ్లాసులు పెట్టుకుని చకచక వస్తోంది.

'బ్రెయిన్ డ్రెయిన్' అనే మాట వినపడంగానే పక్కకు తిరిగాడు.

వాళ్ళిద్దరూ సీరియస్‌గా మాట్లాడు కుంటున్నారు.

'అక్కడ లైఫే మిజరబుల్. ఏదో బావుకుందామని వెళ్ళడమే గాని, యేమీ ఉపయోగంలేదు. మావాడు తిరిగి వచ్చేశాడు. డబ్బువస్తుంది. డబ్బు రాంగానే సరా! అక్కడ 'లైఫ్' ఏముంది! 'ఫారెన్ కంట్రీస్'లో కంటె ఇక్కడే అవకాశాలు చాలా ఉన్నాయి, ఉపయోగించుకునే తెలివి తేటలుంటే....!

'టూ మచ్ ! .... అబ్సర్డ్ .... దేశాభిమానం చూపిస్తున్నారు అంతే! ....'

'అది వుండాలిగా ముఖ్యంగా ... మనిషికి సహనం, పట్టుదల ముఖ్యం. ఈ రెండూ ఉంటే యిక్కడేనా రాణిస్తాడు...డబ్బుకోసం ఆశపడి అమ్ముడుపోతున్నారు'....కొంచెం తీవ్రంగానే అన్నాడు.

చంద్రుడికి వీపు తట్టినట్టయింది. ఉలిక్కిపడ్డాడు. తన తల్లి కళ్ళల్లోకి వచ్చి కూర్చుంది.

తల్లి ఋణం తీర్చ లేరంటారు !

తల్లితో పోట్లాడి ఆమెను కాదని వచ్చేసిన చంద్రుడితో 'అబ్బాయి, నువ్వు నన్ను వదలిపెట్టి వెళ్ళకురా నాయనా' అని ప్రాధేయపడు తున్నట్లుగా తల్లి అన్నమాటలు చెవుల్లో గింగురు మంటున్నాయి.

చంద్రుడు విలవిల లాడిపోయాడు.

'నిర్మలంటే ఎవరో కాదు నాయనా, నీ తల్లిని కష్టాల్లో ఆదుకుని నిన్నొక మనిషిగా చేసిన శేఖరంగారి కూతురు. నీమీదే ఎన్నో ఆశలు పెంచుకుని కలలు కంటున్నాడు. కృతజ్ఞతకు యేమన్నా అర్థంవుంటే నువ్వు నిర్మలను పెళ్ళిచేసుకోవడమే. ఇది ఒకవిధంగా తల్లిఋణం తీర్చు కొన్నట్లుగాకూడా అవుతుందిరా....' తల్లి మాటలు అన్నీ స్పష్టంగా జ్ఞాపకమున్నాయి.

చంద్రుడి మనస్సుకూడా విమాన ప్రయాణంలాగ ఒడిదుడుకులు లేకుండా నిలకడగా వచ్చేసింది.

తాను హైదరాబాదులో ప్రాక్టీసు పెడితే కావలసిన యేర్పాట్లన్నీ చేస్తానని శేఖరంగారు కూడా హామీ యిచ్చిన మాట నిజమే. అయితే అప్పట్లో ఆయన మాటలు ఓలెక్కలోకి రాలేదు. ఇప్పుడు ఆ మాటల్లో కొత్త అర్థం కనిపిస్తోంది.

'టాలెంట్' వుంటే ఎక్కడైనా రాణిస్తాడు..... ఇదీ నిజమే.

నాకూ టాలెంట్ వుందని రుజువు చేస్తాను...చంద్రుడు ఆవేశ పడ్డాడు.

మొహం ఎర్రబడింది. మనస్సుకు పట్టు చిక్కింది.

'....బెల్టులు కట్టుకోండి. ఢిల్లీ విమానాశ్రయంలో దిగబోతున్నాం.

గలటా ఏభై నిమిషాలు ప్రయాణం ఈ విమాన ప్రయాణం చాలా సుఖ వంతంగా జరిగిందని ఆశిస్తున్నాం....'

ఈ మాట అంటున్నప్పుడు చంద్రుడికే కాదు 'ఆమె'కూ నవ్వొచ్చింది. అందరికీ నవ్వొచ్చింది.

'విమానం పూర్తిగా ఆగేవరకూ అందరూ తమ తమ సీట్లలోనే కూర్చోవాలని కోరుతున్నాం. థాంక్యూ!....' ఆమె విధి నిర్వహణ అప్పటికి ముగిసింది.

చంద్రుడు కూడా మెల్లి మెల్లిగా అడుగు లేసుకుంటూ ఆమె చిరునవ్వును మళ్ళీ ఓసారి చూసి క్రిందకు దిగాడు.

ఆకాశ అంతా 'నిర్మలం'గా వుంది. నిశ్చలంగా చూశాడు. చంద్రుడికక్కూడా ఒకే తార కనిపిస్తోంది.

——